క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్య బృందం

సీతంపేట: మద్రస సల్మాన్ ఫార్సీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం సచివాలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అబ్దుల్ రెహమాన్ మెమోరియల్ హాస్పిటల్ వైద్యులు ఎజాజుర రెహమాన్ పిల్లలకు తనిఖీలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ సదాఫ్ ఖనం, డాక్టర్ బిలాల్ రెహమాన్, వన్‌టౌన్ మెడి జోన్, కేర్ హాస్పిటల్స్, హెల్త్ సిటీ నుంచి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భార్గవ్, ఓమ్ని ఆర్కే డాక్టర్ అరుణ, ఆవాజ్ కమిటీ తమ వైద్య బృందంతో శిబిరానికి వచ్చిన వారికి బ్లడ్, సుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆవాజ్ ప్రధాన కార్యదర్శి అష్రఫ్, జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్, అబ్దుల్ మునీర్ ముషహద్, షేక్ రెహమాన్, షేక్ అబ్దుల్ సత్తార్ పర్యవేక్షించారు.

రామాలయంలో అన్నదానం


అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో చేపట్టిన వసంత నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. నారాయణ సేవలో భాగంగా మధ్యాహ్నం ఆలయం ప్రాంగణంలో అన్నదానాన్ని ఆలయ నిర్వహణ కమిటీ కార్యదర్శి సనపల వరప్రసాద్ ప్రారంభించారు. సుమారు 2వేల మందికి అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు టీఎస్ రెడ్డి, సంయుక్త కోశాధికారి జీవీ ఆనందరావు తదితరులు పాల్గొని సహకరించారు.

అప్పన్నకు వెండి పాత్రల బహూకరణ


ఈవోకు వెండి పాత్రలు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నగరంలోని సీతమ్మధారకు చెందిన ఆచంట నాగభూషణరావు కిలో బరువుగల నాలుగు వెండి పాత్రలను కానుకగా సమర్పించారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన దాత వాటిని దేవస్థానం ఈవో కె.సుబ్బారావుకు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, దేవస్థానం పంచాంగ కర్త తెన్నేటి శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం


సీతమ్మధార బాలయేసు చర్చిలో ఆదివారం మట్టల పండగ సందర్భంగా క్రైస్తవులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ముత్యమాంబ జాతరకు ఏర్పాట్లు



కంచరపాలెం: కంచరపాలెం వాసుల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి వార్షిక నవరాత్రి జాతర మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 16 నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు గవరకంచరపాలెం గ్రామాధ్యక్షుడు మళ్ల రామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాళ్ల రామగోవింద్, ప్రధాన కార్యదర్శి మళ్ల రమేష్‌గౌరి తెలిపారు. 16న తొలేళ్లలో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు, పుట్టబంగారం తేవడం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 17న ప్రధాన జాతర, 24న మారువారం, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. కంచరపాలెం ఫ్లైఓవర్ కూడలిలో అమ్మవారి ఆలయ పరిసరాలు, గాలి గోపురాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.

పచ్చదనం పరవళ్లు


వాకర్స్ పార్కులో విరబూసిన అందమైన క్రోటన్స్


వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పచ్చదనం


సర్వీసు రోడ్డులో పచ్చదనం

అందం.. ఆహ్లాదంతో అలరారుతున్న మురళీనగర్

ఆరోగ్య పరిరక్షణకు చెట్ల పెంపకం

పార్కులు, నివాస ప్రాంతాలన్నీ పచ్చదనమే

మురళీనగర్: పచ్చదనానికి పెట్టింది పేరు మురళీనగర్. ఎక్కడ చూసినా పచ్చని మొక్కలు విస్తరించి అందంగా కనిపిస్తుంది. దీనికి తోడు పార్కులన్నీ పచ్చదనంతో నిండి ఉంటాయి. వీధుల్లో పచ్చని వృక్షాలు కనువిందు చేస్తాయి. పచ్చదనం పరవళ్లు తొక్కినట్లు కనిపిస్తుంది.

ఇంటికో చెట్టు–ఈశ్వరుడికో మెట్టు..

ఇక్కడి ప్రజలు తమ ఇళ్ల వద్ద చెట్ల పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చి వాటిని అపురూపంగా చూసుకుంటారు. ప్రతి ఇంటి ముందు ఒక చెట్టు పెంచితే ఈశ్వరుడిని పూజించినట్టేనని భావిస్తారు. అందుకే ఏ ఇంటిని చూసినా ఒక పచ్చని చెట్టు ఉంటుంది. అపార్టుమెంట్ల బాల్కనీల్లో కూడా మొక్కలు పెంచుతున్నారు. కాంక్రీటు వనంలో స్వచ్ఛమైన గాలి కోసం ప్రత్యామ్నాయ మార్గంగా కారిడార్లలో ఆక్సిజన్‌ను ఎక్కువగా విడుదల చేసే మొక్కలు పెంచుతున్నారు. ఇళ్ల ముందు భాగంలోని ఖాళీ ప్రదేశాల్లో ల్యాండ్ స్కేపింగు ఏర్పాటు చేసి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసుకుంటున్నారు.

అదనపు ఆకర్షణగా పార్కులు..

మురళీనగర్‌లో పార్కులు పచ్చదనానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ఇవి ఈ ప్రాంతానికి అదనపు ఆకర్షణగా చెప్పుకోవచ్చు. వాకర్స్ పార్కు వృక్ష సంపదతో సందర్శకులను ఆకర్షిస్తుంటుంది. ఇక్కడ ఆయుర్వేద వైద్యానికి ఉపయోగపడే మెడిసినల్ ప్లాంట్లు కూడా ఉన్నాయి. ఈ చెట్ల గాలి ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడుతుంది. వైశాఖి స్పోర్ట్స్ పార్కు, బృందావన్ పార్కు, హరిత పార్కు, ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులు పచ్చదనంతో సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. వాకింగ్ ట్రాకులు, కాలి బాటలకు ఇరువైపులా పచ్చని చెట్లు పెంచుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.


ప్రశాంతిపార్కులో పచ్చదనం

పచ్చదనానికి ప్రథమ ప్రాధాన్యం..

మురళీనగర్‌లో ప్రజలు పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తారు. అవకాశం వచ్చినప్పుడల్లా చెట్ల పెంపకానికి ముందుకు వస్తారు. మొక్కలు నాటడమే కాదు. వాటి పరిరక్షణకు అంతే బాధ్యత తీసుకుంటారు. దీంతో మురళీనగర్‌లోని 13 సెక్టార్లలో ఎక్కడ చూసినా పచ్చదనం పరుచుకుని ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది. అందుకే చాలా మంది తమ నివాసాలను మురళీనగర్‌లో ఏర్పాటు చేసుకోవాలని భావిస్తారు. వీధులన్నీ చెట్లతో నిండి ఉంటాయి. ప్రణాళికాబద్ధంగా కాలనీని నిర్మించడంతో రోడ్డుకు ఇరువైపులా వృక్షాలు దర్శనమిస్తాయి. ఇవి వీధుల్లో పచ్చ తోరణాల్లా కనిపిస్తాయి.


వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పచ్చదనం మధ్య వాకింగ్ చేస్తున్న వాకర్లు


హరితా పార్కులో పచ్చదనం


మురళీనగర్ వాకర్స్ పార్కులో పచ్చని వాతావరణం

అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోర్తుటౌన్ సీఐ సత్యనారాయణ


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా సీఐ రమణ

సీతమ్మధార: అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ తప్పదని ఫోర్తుటౌన్ సీఐ ఎ.సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించి వేలి ముద్రలు, సంతకాలు సేకరించారు. ముందుగా ఎవరెవరు ఏ కేసుల్లో ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి షాపుల వద్ద అల్లర్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిపై సీరియస్ అయ్యారు. మంచిగా ఉంటే మంచిగా ఉంటాను లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. గొడవలకు పాల్పడినా, ఎవరినైనా బెదిరించినా ఉపేక్షించేది లేదన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని తెలిపారు. హాజరు కానీ రౌడీషీటర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ఎందుకు రాలేదని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఆదివారం స్టేషన్‌కు తప్పనిసరిగా రావాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో..

అల్లర్లు సృష్టించకుండా మంచిగా మసులుకోవాలని ద్వారకా సీఐ డి.వి.రమణ రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని తెలిపారు. ఈ సందర్భంగా రోజువారీ కదలికలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గంగాధర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎంవీపీకాలనీ: ఎస్సీ కార్పొరేషన్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను అందిస్తున్న సబ్సిడీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ ఒక ప్రకటనలో కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీ సోమవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విశాఖ జిల్లాకు 406 యూనిట్ల సబ్సిడీ రుణాలను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. రూ.16.88 కోట్లతో 32 కేటగిరీల్లో లబ్ధిదారులకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి మే 10వ వరకు https://apobmms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21 నుంచి 50 ఏళ్ల లోపు వయసు గల వారు సబ్సిడీ రుణాలకు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డ్, తెలుపు రేషన్ కార్డ్, పాన్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు.

హత్యాయత్నం కేసులో దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార: అక్కయ్యపాలెం అబిద్‌నగర్ పార్కులో ఆవాల నరసింహారావు అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఫోర్త్‌టౌన్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడి కోసం నాలుగు బృందాలతో గాలిస్తున్నారు. అబిద్‌నగర్ పార్కులో నరసింహారావు తలపై గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో దాడి చేయగా.. అతడు రక్తపు మడుగులో అక్కడికక్కడే కుప్పకూలిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి పార్కులోకి ఎంత మంది వచ్చారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలిస్తున్నారు. సీఐ ఎ.సత్యనారాయణ అబిద్‌నగర్ ప్రాంతంలో ఉన్న కొంత మందిపై నిఘా పెట్టారు. వెంకటరావువ్‌అనే పేరున్న కొందరిని విచారిస్తున్నారు. కొంత మంది రౌడీషీటర్లను విచారించారు. రోజూ అబిద్‌నగర్ పార్కుకు వచ్చే వారి వివరాలు సేకరిస్తున్నారు.

వ్యాయామంతోనే మెరుగైన నాడీ వ్యవస్థ

న్యూరాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్వర్లు


పార్కిన్సన్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు


పాల్గొన్న మురళీనగర్ వాసులు

మురళీనగర్: నాడీ వ్యవస్థ సక్రమంగా పని చేయాలంటే వ్యాయామం తప్పనిసరని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. వాకర్స్ హెల్త్ క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మురళీనగర్‌లోని హరిత పార్కులో 'పార్కిన్సన్ (వణుకుడు) వ్యాధిపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అరవై ఏళ్ల వయసు పైబడిన వారిలో మాత్రమే నాడీ కణాలు మెదడను దెబ్బ తీస్తాయని తెలిపారు. దీని వల్ల న్యూరోట్రాన్స్‌మీటర్ పని చేయకపోవడం వల్ల ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. కాళ్లు, చేతులు, దవడల్లో వణుకు రావడం, కండరాలు బిగ దీయడం లేదా పట్టేయడం, పని వేగంలో తగ్గుదల, స్నానం, తినడం వంటి సాధారణ కార్యకలాపాలను కూడా ఆలస్యంగా చేస్తారన్నారు. నిరాశ, నిస్పృహలు, భయం, చొంగ కార్చడం, చర్మ, మూత్ర సమస్యలు వస్తాయని వివరించారు. వ్యక్తి మాటలు, చేతిరాతను దెబ్బ తీయడం ఈ వ్యాధి లక్షణాలని ఆయన తెలిపారు. నాడీ వ్యవస్థ సక్రమంగా పని చేయడానికి, మానసిక ఒత్తిడిని జయించడానికి భౌతిక, మానసిక వ్యాయామాలే దివ్య ఔషధంగా పని చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్కిన్సన్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. స్థానిక వాకర్స్, సమావేశానికి హాజరైన వారికి బనియన్లు, టోపీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, హరిత పార్క్ అధ్యక్షుడు పి. కొండలరావు, కార్యదర్శి దేముడు, కోశాధికారి కిషోర్, సిప్లా కో–ఆర్డినేటర్ బి. కొండబాబు, వాకర్స్ ఇంటర్నేషనల్ కేబినెట్ కార్యదర్శి మహేష్, డిప్యూటీ గవర్నర్లు పల్లా చంద్రమౌళి, సీహెచ్ విజయప్రసాద్, సర్వీస్ డైరెక్టర్ బి.సూరిబాబు, స్కేటింగ్ పార్క్ కార్యదర్శి పీఎస్ఎన్ రాజు, ఏపీఎస్ రాజు, కె.మాధవి, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్లకు అభినందనలు


విద్యార్థినులకు స్వీట్ తినిపించి అభినందిస్తున్న హెచ్‌ఎం రాంప్రసాద్

సీతమ్మధార: సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్ ప్లస్ విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం డి.రాంప్రసాద్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపీసీ ఫస్టియర్‌లో ఎం.సంజన 462/470 మార్కులు, కె.నాగభూమిక 442/470 మార్కులు, జె.సాహితి 422/470 మార్కులు సాధించారు. బైపీసీలో బి.మల్లేశ్వరి 403/440 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్ టాపర్లకు హెచ్‌ఎం స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. శ్రీహరిపురం హెచ్‌ఎం జి.జి.ప్రియదర్శిని, ఎస్.భారతి, పి.సంధ్యారాణి, విక్టర్, ఇ.భవాని తదితరులు పాల్గొన్నారు.


కుమార్తె ఉమకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

కార్డియాలజిస్ట్ కావడమే లక్ష్యం

ఆశీలమెట్ట నారాయణ కళాశాలలో చదువుతున్న కాళ్ల ఉమ ఇంటర్ బైపీసీలో 988 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఫస్టియర్‌లో 434 మార్కులు సాధించిన ఉమ ఎంబీబీఎస్ చదివి కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నట్లు తెలిపింది. ఆమె తండ్రి కాళ్ల అప్పలరాజు రేషన్ డీలర్. తల్లి పద్మ గృహిణి. తాను చదువులో రాణించడానికి వారు ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని తెలిపింది. తాను ఉన్నత స్థాయికి చేరుకుని వారికి మంచి గుర్తింపు తీసుకొస్తానని ఉమ తెలిపింది. అధ్యాపకుల గైడెన్స్‌తో మంచి మార్కులు సాధించగలిగానంది.

ఎర్నిమాంబకు పూజలు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు నిర్వహించారు.

'ఎవర్‌గ్రీన్' సమ్మేళనం


నగరంలోని హోటల్‌లో ఆత్మీయంగా కలుసుకున్న ఎవర్‌గ్రీన్ బ్రేక్‌ఫాస్ట్ సభ్యులు

మురళీనగర్: స్నేహితులు కలుసుకునేందుకు అనేక మార్గాలను అనుసరిస్తారు. అందరూ ఓచోట కలిసి తమ అనుభవాలను పంచుకుంటారు. నగరంలోని పలువురు పదవీ విరమణ చేసిన, ప్రస్తుతం సర్వీసులో ఉన్న అధికారులు, వివిధ రంగాల్లో నిష్ణాతులు తమ స్నేహితులతో కలిసి గడిపేందుకు ఎవర్‌గ్రీన్ బ్రేక్‌ఫాస్ట్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ఇది వినడానికే కొత్తగా ఉన్నప్పటికీ ప్రతి నెలా వీరు నగరంలోని ఒక హోటల్‌లో కలుసుకుని తమ స్నేహితులతో ముచ్చటిస్తూ ఆనందంగా గడుపుతారు. ప్రతి నెలా ఒక ఆదివారం వీరు బ్రేక్‌ఫాస్ట్‌కు హాజరవుతారు. ఈ మేరకు వీరు నగరంలోని ఒక హోటల్‌లో కలుసుకుని బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నారు. కుటుంబ సమేతంగా ఒక చోట చేరి ఆనందంగా గడిపారు. వీరిలో 'ది ఆర్ట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్'' సంస్థను నడుపుతూ బాలికల విద్యా వ్యాప్తికి పదేళ్లుగా కృషి చేస్తూ తన ఆదాయంలో పది శాతం కేటాయిస్తున్న డాక్టర్ సోమనాథ్ సాహూను సభ్యులు ఘనంగా సత్కరించారు. సాహూకు మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డాక్టరేట్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఆయనను అభినందించారు. ప్రైమ్ మినిస్టర్ మ్యూజియం భరత్ విభీషణ్ అవార్డు, కోల్‌కతాలో రాష్ట్రీయ శిక్షక్ అవార్డు ఆయన అందుకున్నారు. తనను సత్కరించిన సభ్యులకు సోమనాథ్ సాహూ కృతజ్ఞతలు తెలిపారు.

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు


25 ఏళ్ల తర్వాత కలుసుకున్న వసంతబాల విద్యాలయం పూర్వ విద్యార్థులు

సీతంపేట: గురుద్వారా కూడలి సమీపంలోని వెన్నెల ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వసంతబాల విద్యోదయ పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు సందడిగా జరిగాయి. 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనందంగా గడిపారు. ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఉషారాణి, ఉషాకుమారి, కమలాకర్, ఉమాదేవి, సుబ్బలక్ష్మి, రమణ, అటెండర్ ముత్యాలును ఘనంగా సత్కరించి వారితో జ్ఞాపకంగా ఫొటోలు దిగారు. స్నేహితులంతా సెల్ఫీలతో సందడి చేశారు. పూర్వ విద్యార్థుల కలయిక కోసం కృషి చేసిన లీలామాధవి, వనిత, శ్రీనివాస్, అచ్యుత్, రామకృష్ణ, పి.సతీష్, హరి, పద్మలను సహచరులంతా అభినందించారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక


మెళియాపుట్టి గ్రామ కుటుంబ సభ్యుల సందడి

సీతమ్మధార: హలో బాబు.. ఎలా ఉన్నావు.. హాయ్ మురళీ, బుజ్జి, సురేష్ బాగున్నారా.. ఇప్పుడు ఏం చేస్తున్నారు.. అంటూ శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి గ్రామస్తులు కుటుంబ సమేతంగా ఆదివారం పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలోని గాయత్రీ టవర్స్‌లో ఆత్మీయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజుల్లో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని, ఎవరు ఏ వృత్తిలో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. నగరంలో నివసిస్తున్న 200 కుటుంబాలు కలిసి సందడి చేశాయి. చిన్నారులు నృత్యం చేసి, పాటలు పాడి అలరించారు. పెద్దలు మ్యూజికల్ చైర్, జల్దీ ఫైవ్ ఆడి డ్యాన్స్‌లు వేశారు. జోక్స్ చెబుతూ నవ్వించారు. రోజంతా కబుర్లు చెప్పుకుని ఆనందంగా గడిపారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.